క్లుప్తంగా

రుణాల అందజేత

ఏ.కొండూరు: రుణాలు సద్వినియోగం చేసుకో వాలని పీఏసీఎస్ చైర్మన్ తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పోలిశెట్టిపాడు పీఏసీఎస్ పరిధిలో దీర్ఘకాలిక రుణాలను రైతులకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ పరిధిలో సంఘ సభ్యులకు 24 మంది రైతులకు ఒక కోటి 12 లక్షలు దీర్ఘకాలిక రుణాలు కంభంపాడు కేడీసీసీ బ్యాంక్ ద్వారా అందించామన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే మళ్లీ కొత్తరుణాలు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

విద్యార్థులకు పోటీలు

తిరువూరు: దసరా సెలవుల సందర్భంగా తిరువూరు పట్టణంలోని విద్యార్థులకు శుక్రవారం పలు పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, చిత్రలేఖన పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. బాలికలకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, స్పీడ్ వాకింగ్ పోటీలను నిర్వహించామని, విజేతలకు 24న బహుమతులు అందజేస్తామని తెలిపారు.

మేలైన సేద్య పద్ధతులను పాటించాలి

జి.కొండూరు: రైతుస్థాయిలో విత్తనోత్పత్తి చేస్తున్న రైతులు మేలైన సేద్య పద్ధతులను పాటించడం వల్లన నాణ్యమైన విత్తనాలను పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మోనీషా అన్నారు. మండలంలోని చెవుటూరు రైతు భరోసా కేంద్రంలో విత్తనోత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ రాంకుమార్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

మైలవరం: స్థానిక శ్రీకంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అమ్మ వారిని శుక్రవారం సరస్వతీదేవిగా అలంకరించారు. అమ్మవారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెన్నులు, పుస్తకాలు, పలకలు అందజేశారు.

భారీ వర్షం

మైలవరం: మైలవరంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు నిర్మలంగా ఉన్న ఆకాశం సాయంత్రానికి మబ్బులు కమ్మి ఒక్కసారిగా కుండపోతగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక నూజివీడు రోడ్డు మీద వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

రేషన్ బియ్యం పట్టివేత

తిరువూరు: మండలంలోని కొమ్మిరెడ్డిపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల విజిలెన్స్ అధికారులు శుక్రవారం స్వాధీనపరచుకున్నారు. గ్రామంలోని చాట్ల సుమతి నివాసంలో 40 బస్తాలలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైనట్లు పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దారు శ్వేత తెలిపారు. విజిలెన్స్ ఎస్సై నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సారా తయారీ నేరం

చాట్రాయి: సారా తయారీ చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విశ్వనాధరావు తెలిపారు. సారా తయారీదారులకు సారా నిర్మూలనపై శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తాగడం వల్ల చాలా మంది అనారోగ్యానికి గురై చనిపోతున్నారన్నారు. సారా తయారీని నిర్మూలించాలని కోరారు. అనంతరం ఎనిమిది మంది సారా తయారీదారులను నూజివీడు ఎక్సైజ్ ఎస్సై మురళీధర్ తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేశారు.

అసైన్డ్ భూముల పరిశీలన

చాట్రాయి: మండలంలోని చాట్రాయి గ్రామంలో 34 మంది దళితులు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ శుక్రవారం పరిశీలించారు. పిత్రార్జిత భూములు సాగు చేసుకుంటున్నామని వాటికి పట్టాలు ఇవ్వాలని సాగుదారులు దరఖాస్తులు చేసుకున్నారు. రైతులందరితో మాట్లాడి, రికార్డులు పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని సబ్‌కలెక్టర్ తెలిపారు.

హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు

నూజివీడు: స్థానిక డిపో నుంచి హైదరాబాద్‌కు దసరా సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో ఇన్‌చార్జి మేనేజర్ జీఎల్‌టీవీ సుబ్బారావు శుక్రవారం తెలిపారు. ప్రత్యేక బస్సులను మామూలు చార్జీలతోనే నడుపుతున్నామన్నారు. ఈనెల 26నుంచి వచ్చే నెల 25వ తేదీవరకు కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. నూజివీడు, పోలవరం, చాట్రాయి, విస్సన్నపేటలో కార్గో పాయింట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైద్య శిబిరాలు విజయవంతం

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామ వైద్య శిబిరాలు విజయవంతంగా ముగిసినట్లు మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ శుక్రవారం తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష మండల టీమ్-1, టీమ్-2 అధికారులు, ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో 14 సచివాలయాల పరిధిలో 14 గ్రామ వైద్య శిబిరాలు నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ అధ్యక్షతన వైద్య శిబిరాలను విజయవంతం చేసిన వైద్య బృందం సభ్యులను జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, సీనియర్ నేత సుబ్బారావు ఘనంగా సన్మానించారు.

సరస్వతీ నమస్తుభ్యం..

దసరా ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవి అలంకారంలో దర్శన భాగ్యం కల్పించారు. 'సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి.. విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమే సదా.. పద్మపత్ర విశాలాక్షీ పద్మకేసర వర్ణినీ.. నిత్యం పద్మాలయాదేవి సా మాం పాతు సర్వతీ' అంటూ భక్తులు ప్రార్థించారు.





నెమలిలో విద్యాలక్ష్మీదేవిగా..

గంపలగూడెం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు గంపలగూడెం, తోటమూల, పెనుగొలను, ఊటుకూరు, గోసవీడు, ఆర్లపాడు, మేడూరు, వినగడప తదితర గ్రామాల్లోని పలు ఆలయాల్లో మూలా నక్షత్రం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినగడప సుందర హనుమత్ పీఠం, మేడూరు భ్రమరాంబికా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా జరిపారు.

విద్యాలక్ష్మీ నమోస్తుతే!

నెమలి(గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం విద్యాలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యుల అర్చకబృందం రాజ్యలక్ష్మీదేవికి విద్యాలక్ష్మి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

మైలవరంలో..

మైలవరం: దసరా ఉత్సవాల్లో భాగంగా మైలవరం తిరువూరు రోడ్డులోని శ్రీరుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం సరస్వతీదేవిగా అలంకరించారు. అమ్మవారిని మల్లె పూలు, గులాబీలతో అలంకరించారు. స్థానిక విజయవాడ రోడ్డులో కేడీసీసీ బ్యాంక్ వద్ద మోటార్ కార్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: కొండపల్లి రామాలయం, జూపూడి గంగానమ్మ ఆలయం, కొటికలపూడి రామాలయం, ఇబ్రహీంపట్నం దుర్గమ్మ ఆలయాల వద్ద అమ్మవార్లు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా సామూహిక కుంకుమార్చన, కలువ పూలతో ప్రత్యేక పూజలుచేసి దర్శించుకున్నారు.

రాయనపాడులో..

రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు గ్రామంలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. విజయవాడ రూరల్ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాటంనేని పూర్ణచంద్రరావు, సర్పంచ్ కాటంనేని కల్యాణి దంపతులు అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు.



గంపలగూడెంలో కనకదుర్గమ్మకు సమర్పించిన సారె

తిరువూరులో..

తిరువూరు: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం ఆరో రోజు తిరువూరు పట్టణంలోని పలు ఆలయాల్లో విశేషపూజలు నిర్వహించారు. శాంతినగర్ శ్రీకనకదుర్గాలయం, శ్రీగౌరీ కేదారేశ్వరస్వామి ఆలయం, శ్రీఅష్టలక్ష్మీ ఆలయాల్లో సరస్వతీ దేవి అలంకారం చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పాతతిరువూరు యాదవబజారు, జైహింద్ సెంటర్, ఆర్యవైశ్య కల్యాణ మంటపం, పీటీకొత్తూరు రామాలయం, శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీచంద్రమౌళీశ్వరాలయాలలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు జరిగాయి. తిరువూరు శ్రీషిర్డిసాయి మందిర భక్తబృందం ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో రుక్మిణీకృష్ణ ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో సామూహిక అక్షరాభ్యాసం, ఏక్ మినిట్ పోటీలు నిర్వహించారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: దసరా ఉత్సవాలలో భాగంగా వెల్లటూరు వేణుగోపాలస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారు శుక్రవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ పండితులు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు.

నూజివీడులో..

నూజివీడు: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో కొలువైన కోట మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో మహిషమ్మ శుక్రవారం సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలానక్షత్రం అమ్మవారికి ప్రీతిపాత్రం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలను ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

చదువుల తల్లీ నమోస్తుతే!

బలివే(ముసునూరు): చదువుల తల్లీ, సరస్వతీ మాతా! మా బిడ్డలకు చదువుల వరముల నిమ్మంటూ దేవీ శరన్నవ రాత్రులలో ఆరవ రోజైన శుక్రవారం సరస్వతీదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి మహిళలు పూజలు నిర్వహించారు. బలివేలోని ప్రసిద్ధ రామలింగేశ్వ స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో అర్చకులు చావలి అమర్‌బాబు ఉప ఆలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. పలువురు తమ చిన్నారులతో సరస్వతీ మాతకు పూజలు చేయించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక ద్వారకా నగర్‌లోని కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని శుక్రవారం సరస్వతీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయల చైర్మన్ కోటగిరి సునీల్‌కుమార్, ఆలయ ఈఓ సీతారామయ్య పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ

గంపలగూడెం: గంపలగూడెం గాంధీ సెంటర్‌లో ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కనకదుర్గమ్మకు మహిళలు సామూహికంగా సారె సమర్పించారు. ముందుగా అమ్మవారి ప్రతిమకు సర్వతీదేవి అలంకరణ చేసి అర్చకులు పూజలు నిర్వహించారు.

జగన్మాత సేవలో ఎమ్మెల్యే వసంత కుటుంబం

ఇబ్రహీంపట్నం: విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మూలానక్షత్రం సందర్భంగా భక్తులకు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, శిరీషా దంపతులు, కుటుంబ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. సర్వస్వతీదేవి అలంకరణలో అమ్మవారిని దర్శించుకోవడం మహాభాగ్యమని ఎమ్మెల్యేవసంత పేర్కొన్నారు.



విజయవాడ దుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులు



నూజివీడులో సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన కోట మహిషమ్మ



మైలవరంలోని శ్రీరేణుకాదేవి సమేత పాండురంగస్వామి ఆలయంలో సరస్వతీదేవి అలంకారం



జూపూడి గంగానమ్మ ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు



జూపూడి గంగానమ్మ ఆలయంలో సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి పూజలు



తిరువూరు యాదవబజారులో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు



వెల్లటూరు వేణుగోపాలస్వామి ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు



విస్సన్నపేటలో కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో సరస్వతీదేవి అలంకారం



బలివేలో చదువులతల్లి సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



తిరువూరు శ్రీగౌరీకేదారేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీదేవి అలంకారం

వైద్యరంగానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే రక్షణనిధి

కోకిలంపాడు(తిరువూరురూరల్): రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని, నాలుగున్నరేళ్లలో గ్రామాలకు వైద్యసేవలను విస్తృత పరచిందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. తిరువూరు మండలం కోకిలంపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లను నిర్మించి రోగులకు సత్వరవైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. వైద్యుల కొరత తీర్చి గ్రామాల్లోని దీర్ఘకాలిక రోగులకు ఇంటివద్దే వైద్యం అందించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, సర్పంచ్ మాధవీలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, వైద్యాధికారులు గార్గేయ, కల్యాణ్‌చక్రవర్తి, మౌనిక, నరసింహనాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణరావు, నర్సిరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



తిరువూరు మండలం కోకిలంపాడులో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



ముసునూరులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు డా.ప్రతాప్

జగనన్న ఆరోగ్య సురక్ష..
ప్రజల ఆరోగ్యానికి రక్ష

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలిచి, ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు ఉపయోగపడుతోందని జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష మండల టీమ్-2 అధికారి, తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన శుక్రవారం ముసునూరు మెయిన్ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామ వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు కరీముల్లా, కిరణ్‌కుమార్, ప్రతాప్, ప్రత్యేక వైద్య నిపుణులు ప్రవీణ్, చిన్న పిల్లల వైద్య నిపుణులు ఎడ్విన్‌రాజ్ 738 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జెడ్పీటీసీ ప్రతాప్ నలుగురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేర్ల నమోదు, రక్తపరీక్షలు, వైద్య పరీక్షలు, నేత్ర చికిత్సలు, మందుల పంపిణీ, పోషకాహార ప్రదర్శనలను సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. సర్పంచ్ కె.విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని ఎంపీడీఓ శంకరరావు అన్నారు. మండలంలోని కొమ్మూరు, సూరవరంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబరంలో 382 మందికి పరీక్షలు నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ వెంకటరత్నం, తహసీల్దార్ ఉదయ భాస్కర్, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, సూరవరం సర్పంచ్ గరికపాటి వీర వెంకటేశ్వరరావు, కొమ్మూరు సర్పంచ్ ఏసు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజ స్థాపనకు ప్రభుత్వం కృషి

పెనుగొలను(గంపలగూడెం): ఆరోగ్య సమాజస్థాపనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని గంపలగూడెం ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గంపలగూడెం మండలం పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం శిబిరంలో వైద్యులు భానుతేజ, వాసవి, కే సురేష్, శశిప్రియ, ఆప్తమాలజిస్టు శ్రీనివాసరావు 810మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నకేశవరెడ్డి, సర్పంచ్ లలిత, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, కార్యదర్శి చంద్రిక పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ నా మట్టి-నా దేశం కార్యక్రమం ప్రారంభం



మట్టి సేకరణను ప్రారంభించిన ఎమ్మెల్యే రక్షణనిధి

కోకిలంపాడు(తిరువూరురూరల్): ఆజాదీ కీ అమృత మహోత్సవంలో భాగంగా తిరువూరు మండలంలోని కోకిలంపాడులో నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో నా మట్టి-నాదేశం కార్యక్రమం ప్రారంభమైంది. ఎమ్మెల్యే రక్షణనిధి మట్టి సేకరణతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిరువూరు, ఏకొండూరు, విస్సన్నపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో సేకరించిన మట్టిని ఢిల్లీకి పంపనున్నట్లు జిల్లా యువజన సంక్షేమాధికారి రాము తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం విజయవాడ ఆధ్వర్యంలో స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద బ్లాక్ లెవిల్ మేరీ మట్టీ-మేరీ దేశ్ కలశ యాత్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండలంలో గ్రామాల నుంచి సేకరించిన మట్టిను ఒకే కలశంగా ఏర్పాటు చేశారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జిల్లా యూత్ అధికారి ఎస్.రాము, ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, ఏపీఓ అనురాధ పాల్గొన్నారు.

■ **సరస్వతీ ఆలయంలో అక్షరాభ్యాసాలు**

నూజివీడు: పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులోని జ్ఞానసరస్వతీ ఆలయంలో శుక్రవారం అక్షరాభ్యాసాల కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం అమ్మవారికి ప్రీతిపాత్రమైనది కావడంతో చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఒకవైపు అక్షరాభ్యాసాల కోసం వచ్చిన భక్తులతోను, మరోవైపు చదువుల తల్లి సరస్వతిని దర్శించుకునే వారితో ఆలయం ప్రాంగణం వద్ద కోలాహలం నెలకొంది. ఆలయం వద్ద వచ్చిన వారందరికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. నూజివీడు-హనుమాన్‌జంక్షన్ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ముందుగానే ఏర్పాట్లు చేశారు.

■ **నేడు సచివాలయ భవనం ప్రారంభం**

ఆగిరిపల్లి: మండలంలోని బొద్దనపల్లిలో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు శుక్రవారం తెలిపారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ **నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**

జి.కొండూరు: సాధారణ మరమ్మతుల్లో భాగంగా మండలంలోని కుంటముక్కల, జి.కొండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్ రామ్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

■ **నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం**

నూజివీడు: మండలంలోని తూర్పు దిగవల్లిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు, గొల్లపల్లి, దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పెనుగొలనులో..

పెనుగొలను(గంపలగూడెం): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలంలోని పెనుగొలనులో శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే శిబిరాన్ని రాజవరం, చల్లగుండ్లవారిపాలెంలో, జింకలపాలెం గ్రామస్తులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

■ **సీసీ రోడ్డు ప్రారంభం**

విస్సన్నపేట: స్థానిక కనకదుర్గా అమ్మవారి ఆలయం రోడ్డు గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షలతో నూతనంగా నిర్మించి సీసీ రోడ్డును గ్రామ సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి నాయకులు శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఉప సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, సొసైటీ అధ్యక్షుడు రెడ్డి ముత్యాలు, నాయకులు కోటా శ్రీనివాసరావు, నాంచారయ్య, పుల్లారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.